18-10-67

ఆశించినది చేతికందే దూరంలో ఉంది కదా అని, చేతికందినట్లె భావించడం తప్పు! ఆశించడంలో గొప్పలేదు ఆశించినది అందుకో గలగడంలోనే ఉంది .... అందుకో లేనప్పుడు వారివారి జీవితాలు సమాంతర రేఖలే. కారణం — మనిషి అనేవాడు ఎవరినైనా ఒకరినే, ఒకసారే ప్రేమించగలడు. ఒకసారి హృదయ పీఠంపై అధివసింప జేసుకున్న స్త్రీని మార్చి వేరొక స్త్రీని నిలుపుకోవడం సాధ్యంకాదు.

# సమాంతర రేఖలు



## పాలకోడేటి సత్యనారాయణరావు

"రేజర్స్ ఎడ్జ్" చదవటం పూర్తిచేశాను. నేనీసారి సమ్మర్ గడపడానికి వేసుకొన్న ప్రోగ్రాంలో నవలా పఠనం ఒకటి. రేజర్స్ ఎడ్జ్ మూడో నవల. కనీసం ఎనిమిది చదవాలనే ఊహ. పుస్తకాలు పక్కింటి ప్లీడర్ మదనమోహన్‌గారివి.

పుస్తకం ఇచ్చాను. వేరొకటి తీసుకుందామని షెల్ఫ్ వద్దకు వెళ్ళాను. ది టేల్ ఆఫ్ టు సిటీస్, డాక్టర్ ఝివాగో, ది గుడ్ ఎర్త్ వరసగా ఉన్నాయి. అన్నిటికన్న నన్నాకర్షించింది డాక్టర్ ఝివాగో. సినిమా తీస్తే అది అకాడమీ అవార్డుకై నామినేషన్ వేయించుకోగలిగింది కనక మరింతగా ఆకర్షించబడ్డాను. పుస్తకం తీసుకున్నాను. పేజీలు తిప్పాను. ఏవో కాగితాలు కనిపించాయి.

అలా చూశాను. ఉత్తరంలాగుంది.

"వసుంధరా! . . ."

ఎందుకో చదవాలనిపించింది ఉత్తరాన్ని.

మదనమోహన్‌కేసి చూశాను. సీరియస్‌గా డైరీ చూస్తున్నారు. నా చర్యలను గమనించేటంత అవకాశం లేదతనికి. కానీ అక్కడ చదవగలననే ఆశలేదు—దాదాపు ఎది పేజీలు.

సత్వరంగా మడిచి జేబులో తోశాను ఆ కాగితాలను, సభ్యత్వంతోబాటు.

నాకు ఒకటి తెలుసు.

ఇతరుల ఉత్తరాన్ని చదవడం తప్పు. అందులోనూ ఇవి దాచినవే అయిఉండాలి. వీటిని చదవడం మరీ తప్పు.

కానీ ఈ విషయం తెలిసిన నాకే మరొకటికూడా తెలుసు.

నేను మనస్తత్వశాస్త్రం చదువుకోలేదు. చదవను. అయినా నాకీ విషయం తెలుసు.

అదెందుకోకానీ చెయ్యకూడదీ పని అని తెలిసినా కూడా అదే అందరికీ చెయ్యాలని అనిపిస్తుంది. దీన్ని కేవలం మానసిక బలహీనత అనాలా? లేక మానవ సహజత అనాలా?

దీనికి జవాబు నేను చెప్పలేను.

పేపరు తిప్పుతున్న చప్పుడు వినిపించింది.

ఎందుకో గుండె త్వరగా కొట్టుకుంటూంది.

"ఫేస్ ఈస్ ది ఇండెక్స్ ఆఫ్ ది మైండ్" మరి. నా ఫేస్, నా మైండ్‌కు ఇండెక్స్ కాదా దీ సమయంలో.

చప్పున ఒకటి జ్ఞప్తికి వచ్చింది.

ముఖాన్నిబట్టి, ప్రవర్తనలబట్టి కొంతమంది దొంగల్నిసైతం పట్టుకోగలరట! బాబోయ్!

నవలను తిప్పుతున్నట్టు నటించాను.

మదనమోహన్ నన్ను గమనిస్తున్నారు.

ఆలోచనా ఝరిని క్షణంసేపు అరికట్ట యత్నించాను.

హుఁ! ఆరక్షణం అరికట్టగలిగే శక్తి, స్తోమతు నాలో ఉండిఉంటే ఇంత జరిగేదే కాదు. ఉత్తరాల్ని చదవాలనే ఊహ ఉండేదా?

నేను మానసికంగా బలహీనుణ్ణి.

"ఏ నవల చూశారండీ?"

ప్రశ్న అడిగింది మదనమోహన్.

జవాబు చెప్పాలి; చెప్పాలికూడా.

గొంతు "పెకిలించుకొ" చుప్పాను.

దొంగను దొరుకుతాడు. దొంగల్ని ముఖకవళికల్ని బట్టి తెలుసుకోగలరంటే తెలుసుకోలేరూ మరి! నాలాగే ఎంతమంది?

"ఆఁ. . .!" ఇంతకుమించి అనలేకపోయాను. అన్నానేమో కానీ నాకు తెలియదు.

"డాక్టర్ ఝివాగో? ఏ ఫైన్ నావెల్. చదివారా."

". . . . . ." ఏమిటో అర్థంకాని ఆందోళన. పుస్తకం అట్లా చూశారన్న మాట.

మనసంతా చీకాకయింది.

వెధవది! పిటిల్ని జేబులో పెట్టకపోయినా బాగుండేది.

"ఇంక వెడతానండి." ఎలా అనగలిగాను?

"ఏం? ఆర్ యూ నాట్ ఫీలింగ్ వెల్? నేను అబ్జర్వ్ చేస్తూనేఉన్నాను."

నా గుండెల్లో రాయి పడింది.

క్షణకాలం నిశ్శబ్దం.

చాలా భయంగా ఉంది. లేనిపోని దిగులు.

"యూ ఆర్ నాట్ వెల్. యూమ్ ఐ రాంగ్?"

"నో." దేనికి నో?

"దట్సాల్ రైట్."

"సాయంత్రం . . ."

"ఓ యస్. యూ ఆర్ ఆల్వేస్ వెల్‌కమ్."

పూర్తిగా మాట్లాడలేకపోతున్న నన్ను మదనమోహన్ గారే రక్షిస్తున్నారు.

ఇంటికి వచ్చాను.

"ఏంరా అలా ఉన్నావ్?"

ఎలా ఉన్నాను? అమ్మ అడిగినదానికి ఏమని జవాబివ్వాలి?

"ఏం లేదు. తలనెప్పిగా ఉన్నట్టుంది."

"ఎప్పటినుండి? టీ తెస్తా ఉండు." అమ్మ వెళ్లిపోయింది.

'హుఁ! పాపం! అమ్మ!'

వసారాలోకి వచ్చాను. ఉత్తరాలు చదవాలి. తీశాను. అవి చదివితేగానీ సంతృప్తి కలిగేటట్టు లేదు.

ఉత్తరాలు చూశాను. మొత్తం నాలుగు ఉత్తరాలు. తేదీలవారీగా జతచేశాను.

"వసుంధరా!

ఓడిపోయానే నేను. ఘోర పరాజయం అంటే ఇలాటిదే. నువ్వు చెప్పినదాన్ని అక్షరాలా అమలుపరిచాను కానీ . . ."

తల దిమ్మెక్కిపోతూంది. ఈ వాక్యాలు ఎప్పుడో నేను రాసినవే.

ఎంత ప్రయత్నించినా జ్ఞాపకం రావటంలేదు.

రాతనుబట్టి గుర్తుపట్టలేనాయె. కానీ నేను రాసినవే ఈ వాక్యాలు.

"వసుంధర" పేరుతో నాకు అక్కయ్యకూడా ఉంది. పిన్ని కూతురు.

" . . . నీ ఊహ పూర్తిగా తల్లక్రిందులయింది. నిర్మలకు ఎంతగానో నచ్చజెప్పాను. ఉహుఁ, లాభం లేకపోయింది."

ఈ ఉత్తరం నేను రాసిందే. ఇక సంశయంలేదు.

" . . .నిర్మల ... ఇన్నాళ్లవరకూ నా నిర్మల అను కున్నా గదూ. ఇక నా నిర్మల కాదు... .ఎవరో నిర్మల... పోనీ, మామయ్యకూతురు . . . ."

నిజం! ఇది నేను రాసిందే.

ఇంతసేపు తటపటాయించడానికి కారణం ఉంది. నా కుడిచెయ్యి ప్రమాదంతో విరిగిపోయింది. ఇది కుడి చేతితో రాసింది. దాదాపు ఐదేళ్ళక్రిందట జరిగిం ది విషాద సంఘటన. జీవితం మలుపు తిరిగింది. ఎడమ చెయ్యే ఆధారమయింది అన్నిటికీ.

ఉత్తరంలోని విశేషాలన్నీ తెలుసు.

అయినా చదవాలనే ఆకాంక్ష.

మనస్సాగరంలో ఆ కాంక్షల అలలు ఎగిరెగిరి పడు తున్నాయి.

"వసూ! చాలా ఇదిగా ఉందే! నేను ఓడినందుకు కాదు, నీ ఊహ పటాపంచలైనందుకు, నిర్మలను తప్పుగా అంచనావేసినందుకు.

ఈ పరాజయం నీది, నీదే వసూ!

ఆశ్చర్యపోతున్నావా? ఒప్పుకుంటున్నావా?

ఒప్పుకు తీరాలి. పరాజయం నా ముఖతః జరి గింది అయినా పరాజయం నీది. నిజం! ఎందుకంటే నా నటుకు నేనయితే నిర్మల నీ జన్మలో అడగగల్గే వాణ్ణికాను. మొన్న అదృష్టవశాత్తూ. . .

అదృష్టమా? కాదు. అదృష్టరేఖ నా ముఖాన్నే లేదు.

... దురదృష్టవశాత్తూ నీతో మాటవరసకు అంటే అడగకుండానే సలహా ఇచ్చావు. నా మంచి కోరావు. నా నుదుటగీత వేరొక లిపిలో ఉంటే వసుఅక్కయ్య ఏం చెయ్యగలదు?

కానీ ఒక విధంగా ఆలోచించు, వసుంధరా!

ఇదీ ఒకందుకు మేలే! ఎన్నాళ్లని నిర్మలను ఆరాధించ గలను?

నిజంగా ఇన్నాళ్ళూ నిర్మలను మనస్ఫూర్తిగా కోరు కున్నాను; నాకు కాబోయే భార్యగానే చూశాను. ఇక అలా ట్రీట్ చెయ్యలేను. ఇకమీదట ఎలా?

ఇక నిర్మల కేవలం నా మేనమామకూతురు. అంతే.

మనసంతా ఉడికిపోతూంది, వసూ!

ఏం చెయ్యను చెప్పు?

ఇంతకన్నా రాయలేనిస్థితి నాది.

కామేశ్వర్."

ఒక్క ఉత్తరం పూర్తిఅయింది.

హృదయారణ్యంలో దావాగ్ని.

కంట్లో నీరు తిరుగుతూంది. తుడుచుకోగలిగే స్తోమతు లేదు.

రెండో ఉత్తరం తీశాను.

పిడికిలి అంత ఉండే మనసు నెవరో పిప్పిచెయ్య యత్నిస్తున్నారు.

"వసుంధరక్కయ్యా,

క్షమించు.

ప్రయత్నాలలో సఫలీకృతుణ్ణి కాలేకపోయినా, కనీసం నీసలహాకైనా కృతజ్ఞత చెప్పాలనే ఊహ లేకపోయింది. అందుకే క్రిందటి ఉత్తరంలో థాంక్స్ అనేముక్కే లేక పోయింది. ఇప్పుడు చెబుతున్నాను. వసూఅక్కయ్యా! నీ సలహా నిజం చెప్పాలంటే నన్ను సరైన మార్గంలోకి తీసుకువచ్చింది. నీ సలహాయే లేకపోతే కేవలం అదే భ్రమలో. . . నిర్మల నన్ను ప్రేమిస్తున్నదనే భ్రమ లోనే కొట్టుమిట్టాడుతుండేవాణ్ణి.

చాల ధైర్యంచేసి అడిగాను నిర్మలను.

కానీ నాకు చాలా సంతోషంగా ఉంది.

'ఆలోచించాలి!' అని చెప్పలేదు నిర్మల.

'వద్దు, బావా! నా జీవితంలో నన్ను ఎవరూ కోరుకో వద్దు, ప్రేమించవద్దు. వద్దు,బావా! వద్దు! క్షమించు' అంది గద్గద నిస్వనంతో.

'ఎందుకు' అని అడగాలనుకున్నాను.

కానీ షాక్ తిన్నవాడు వెంటనే తేరుకోలేడుగా!

నేను తేరుకొనేసరికి నిర్మల వెళ్ళిపోయింది

వెళ్ళిపోయింది—నా మనసులోని తన ప్రతిబింబాన్ని శాశ్వతంగా చెరుపుకోమని నన్నాదేశిస్తూ, అర్థిస్తూ, ఆజ్ఞాపిస్తూ.

నిర్మల వెళ్లిపోయింది, వసుంధరా!"

"ఎందుకురా ఏడుస్తున్నావ్? ఏమిటా కాగితాలు?"

"ఏడుస్తున్నానా?"

మరిచిపోయాను—కన్నీటికి కంఠధ్వని బలం కలిగిస్తుందని.

"స్పష్టంగా తెలుస్తుంటేనూ. అయినా ఎందుకు?"

ఏమని చెప్పను అమ్మకు?

"ఏ, లేదే." అమ్మతెచ్చిన టీ తాగి గ్లాసు ఇచ్చేశాను

అమ్మచూపులో అనుమానం.

నే చేసిన నవ్వాలనే ప్రయత్నం పెదవులమీదే విఫల మయింది. అమ్మ వెళ్లిపోయింది. మళ్లీ ఉత్తరంలో పడ్డాను.

"నిర్మల వెళ్లిపోయింది, వసుంధరా!

కానీ నేను వెళ్లలేకపోతున్నాను. నిర్మలకి, నిర్మల మనసుకు సాధ్యమైనంత చేరువలోకి వెడదామనుకున్నాను కానీ ఒకటి మరిచిపోయాను.

రెండు వస్తువులలో ఒకటి, రెండోదానికన్నా వేగంగా పయనిస్తుంటే, వాటి మధ్యదూరం అధికమౌతుంది గదూ! లెక్కలలోని ఈ ప్రాథమికసూత్రాన్ని మరిచి పోయాను. చిన్నప్పుడనుకునేవాణ్ణి—లెక్కలు చెత్త సబ్జక్టు, జీవితంలో పనికిరానిదని. కానీ ఇది నిజం.

నిర్మల మనసు నా మనసుకన్నా వేగంగా ప్రయా ణిస్తూంది కాబోలు, అందుకే నిర్మలకూ, నాకూ మధ్యదూరం అధికమయింది.

కానీ, వసూ! నిర్మల మనసు దేనికోసం అన్వేషణ సాగిస్తూంది? నీకూ తెలియదు గదూ! నేను నిర్మల కోసం.

నిర్మల ఎండమావి. ఫెయిల్ అయిపోయాను, వసూ!

కామేశ్వర్."

ఉత్తరం పూర్తయిన మరుక్షణం మరొకటి.

"డియర్ వసూ!

ఇరవై రోజులయింది ఇప్పటికి మొదటి ఉత్తరం రాసి. కానీ నీకు ఈపాటికి ఎంత అర్థమైనదో తెలియడం లేదు. ప్రతి ఉత్తరంలోనూ నీకు పూర్తిచెయ్యాలనే యత్నం. కానీ ఉత్తరం మొదలుపెట్టిన కొన్ని క్షణాల లోనే ఏదో అర్థంకాని బాధ, ఆవేశం నన్నావరిస్తున్నాయి.

ఫలితమే ఉత్తరం పూర్తిచెయ్యలేకపోవడం.

ఈ ఉత్తరంలో అంతా తెలియజెయ్యాలనే ఉంది. కానీ నాకు నమ్మకంలేదు ఉత్తరం పూర్తిచెయ్యగలనని.

కొన్నాళ్లక్రితం నిర్మల నడిగా — సినిమాకు వెడదామా అని.

'ఎందుకు, బావా? ఇక్కడే ఉందాం. సినిమాకు వెడితే





**స్ట్రెప్సిల్స్ మాత్రమే వాటిని కలిగించే క్రిములను చంపుతుంది — అతి వేగంగా**

కారణమేమిటంటే, స్ట్రెప్సిల్సులో మాత్రమే రెండు బలమైన క్రిమినిరోధక మందులు ఉన్నాయి—ఒకటి, 2:4 డైక్లోరో బెన్‌జిల్ ఆల్కహాల్: రెండు, అమిల్-మిటా-క్రెసోల్ ఈ రెండింటిలో గొంతుక నొప్పిని కలిగించు క్రిములను తప్పక చంపునని ఋజువయిన శక్తి ఉంది. అందువలన మీరు వాడినవెంటనే అంతే త్వరగా మీకు నివారణ నిస్తుంది. వైద్యశాస్త్రీయంగా ఋజువు చేయబడిన స్ట్రెప్సిల్సు దగ్గర ఉంచుకోండి. అవి పిల్లలకు కూడా మంచివి.

**స్ట్రెప్సిల్స్**
క్రిమినిరోధక గొంతు బిళ్ళలు

గొంతుకనొప్పి, దగ్గులకు
అతివేగంగా పనిచేయునవి
వైద్యశాస్త్రీయంగా ఋజువు
చేయబడినవి



స్ట్రెప్సిల్సు దప్పరించండి
గొంతునొప్పి మొదలవ్వగానే:
గొంతులో గరగర,
కష్టముగా మ్రింగుట,
గొంతురాపు, దగ్గు,
పొగత్రాగు వారి
గొంతురాపు మొ॥వి.

A BOOTS RESEARCH PRODUCT

CHBS-IA TL

మాట్లాడుకోలేము గదా! ఇక్కడే హాయిగా ఉంటుంది మరి నాకు. నీ ఇష్టం. వెడదాం అంటే వెడదాం.'

నిజమే! సినిమాథియేటర్లో అసలు మాట్లాడుకోలేము గదా! అసలు నిర్మలను సినిమాకు రమ్మనడానికి కారణం అదే! అడగాలనే ఊహ ఉంది. ఎలా అడగాలో తెలీదు.

అడగమన్నావే కానీ, ఎలా అడగాలో చెప్పావా?

సరే, ఏముందీ, ఇంట్లోనే అడగాలి అనుకున్నాను.

ఆ రోజు ప్రొద్దున్నే వర్షం కురుస్తూంది. నిర్మల తలంటుకొంది. గాలికి తల ఆరబెట్టుకుంటూంది. గుండ్రనిమొహం గదూ, అందంగా ఉంది. ముఖాన తిలకంబొట్టు మెరుస్తూంది. పెదవులమీద క్షణం ఉండి క్షణం పోయే నియాన్‌బల్బులాంటి చిరునవ్వు.

మెరపు మెరిసింది. -

నిర్మల పెదవులమీద మరో మెరపు. దీని తాకిడికి నేను తట్టుకోలేకపోయాను. దగ్గిరగా చేరాను. చనువుగా భుజాలమీద చెయ్యి వేశాను. తిరిగిచూసింది. పలకరింపులా నవ్వింది. పండువెన్నెల కురిపించింది వర్షంతోబాటు— మెరపులతో నిండిన వర్షంతోబాటు.

వసూ! రాయలేకపోతున్నానే! మనసు కుతకుత లాడుతూంది.

ఎన్నాళ్లీ బాధ భగవాన్?

బాధలన్నిటినీ, బంధాలనన్నింటినీ తెంపుకోవాలంటే ఏం చేయాలి? ఆత్మహత్య పిరికిపంద లక్షణం.

ఏమో! ఈవేళ ఇలా రాస్తున్నా. రేపు . . .!

వద్దు, వసూ! నాకు రేపు వద్దు. నిర్మలలేని రేపు వద్దు, జీవితమూ వద్దు.

జరిగింది రాయలేకపోతున్నాను, వసూ!

మరి ఉంటాను,
కామేశ్వర్."

హృదయఫలకంమీద సమ్మెట్ల పోట్లు.

భరించలేని బాధ. చదవలేకపోతున్నాను.

తలచుకుంటుంటేనే, ఇన్నేళ్ల తరవాతన్నా వాపరే, చెప్పరాని వ్యథ.

ఏం చేయాలి?

"ఎవరో వచ్చారురా నీకోసం."

"కూర్చోమను. ఇప్పుడే వస్తున్నా."

పెరటిలోకి వెళ్లి మొహం కడుక్కొని వచ్చాను.

గౌతమి వచ్చింది. సంతోషంగా ఉంది.

"హలో, గుడ్ మార్నింగ్."

"గుడ్ మార్నింగ్."

"ఏం చేస్తున్నారు లోపల?"

"డాక్టర్ ఝివాగో చదువుతున్నా."

"ఫైన్. ఎన్ని పేజీలు చదివి ఉంటారు?"

"వెరీ ఫ్యూ."

"దట్స్ గుడ్. డ్రెస్‌అయి రండి. సినిమాకు పోదాం."

"సినిమాకా?"

"బ్రిడ్జ్ ఆన్ ది రివర్ క్వాయ్ ఆడుతూంది డ్రీమ్‌లాండ్‌లో. కమాన్."

సినిమాకా? క్షణం చదవాలనే ఊహ గెలిచింది అయినా అదీ తాత్కాలికమే. సినిమాలో రిఫ్రెష్ అవ్వచ్చు.

"ఇప్పుడే వస్తా." లోపలికి వెళ్లి డ్రెస్ చేసుకొని వచ్చాను.

దార్లో మౌనంగానే ఉంది గౌతమి.

ఆఫీసు దగ్గిరికి రాగానే అడిగింది, హఠాత్తుగా.

"ఏం? ఈవేళ అడగ్గానే వచ్చేశారు?"

"ఏముందీ, ప్రత్యేక కారణం ఉండదు."

"బలేవారే. ప్రత్యేక కారణం మీరే చెప్పారుగా?"

"నేనా?" క్షణం ఆశ్చర్యానికి లోనయినాను.

"మీ ముఖంలో భావం తెలుస్తూంది లెండి. ప్రత్యేకంగా కారణం అంటూ ఏమీ లేనిదే అంత లోతుగా ఆలోచించవలసింది ఏముంటుంది?"

"సారీ, గౌతమీ. ఏదో తలనెప్పి, నలతగా ఉంది. అంతే."

"పదండి."

పిక్చర్ స్టార్టు అయింది.

స్క్రీన్‌మీద నిర్మలే కనిపిస్తూంది. 'నిర్మలా! నన్నెందు కిలా వేధించుకుతింటావ్?'

"ఇప్పుడే వస్తా" అంటూ బయటకు వచ్చా నేను. సినిమా చూడాలనే లేదు. ఇంటికి వచ్చేశాను.

"ఎవర్రా ఆ అమ్మాయి?" అమ్మ అడిగింది.

"నా కొలిగ్, పేరు గౌతమి."

"అలాగా" అంది అమ్మ.

మళ్లీ వెళ్లి చదవడం ప్రారంభించాను.

"డియర్ వసూ!

ఇది ఐదోదో, ఆరోదో కదూ! పూర్తిగా విఫలమయ్యాయి, వసూ! మళ్లీ నే చేసిన ప్రయత్నాలు.

జీవితసంగ్రామంలో ఓడిపోయా, వసూ!

నన్ను జయించిన జీవితం, కాలం నన్ను మృత్యువుకు అప్పగించలేదు. కేవలం గాయంచేసి వదిలివేసింది.

మనసులోని గాయానికి చికిత్స చెయ్యాలంటే నిర్మలే రావాలి.

నిర్మల చికిత్స కాదుగదా, ప్రథమ చికిత్సకూడా చెయ్య దిక.

అన్నట్టు మరిచాను. నీకు చెబుతున్నాను గదూ, ఆ నాటి ఘటన.

'బావా! చాలా బాగుంది గదా, బావా!'

'ఔను. చాలా బాగున్నావు' అన్నాను. ఎవడి పిచ్చి వాడి కానందం.

'నే కాదు బావా! వాతావరణం.'

'అదే, చాలా బాగుంది నీలాగే." అసమ్మతితో తల ఊపింది నిర్మల.

'ఏం అలా అంటున్నావ్?' అన్నాను నేను.

'ఏం లేదు.'

చుట్టూ చూశాను. ఎవరూ లేరు. ఇంట్లో అత్తయ్య వంటప్రయత్నంలో ఉంది. మామయ్య స్నానం చేస్తున్నాడు.

క్షణం సందేహించాను.

'చూడు, నిర్మలా!'

తలెత్తి చూసింది నిర్మల ఏమిటన్నట్టు.

నిర్మలలో ఎంత అందం చోటు చేసుకోగలిగింది! తన అందం నాకు పంచిపెడితేచాలు, అనిపించింది ఆ క్షణంలో.

ఎలా మొదలుపెట్టాలి? ఎలా అడగాలి? ఏమీ అర్థం కావడంలేదు.

'ఏమిటి, బావా?'

'ఏమిటి, బావా? మరీ అంత ఆలోచించాలా?'

ఔను, మరీ అంత ఆలోచించాలా? నా నిర్మల నాదే.

'చెప్పు బావా! మురిపించుకోకు.'

'ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నా.'

'ఎలా చెప్పాలా? నే చెప్పనా?'

నా హృదిలో వేయి వీణలు మోగాయి. ఆశాజ్యోతి ఉచ్చదశలో ఉంది.

'ఇప్పుడు వర్షం పడుతూంది. ఇలాగ చెప్పు నీ మనసులోది.'

తంత్రులు తెగాయి. జ్యోతి ఆరిపోయింది.

ఎంత సాఫీగా అంది? అనమంది?

ఈ ఒక్కవాక్యంతో నిర్మల నాకు దూరమౌతూందనిపించింది.

అయినా అడుగుతాను. నా నిర్మలవద్ద నాకు ఆలోచనా?

'అలా చెప్పలేనే ఒక్క ముక్కలో . . .'

నవ్వింది నిర్మల. 'పోనీ రెండు వాక్యాలలో చెప్పు.'

'ఊహుఁ. చెబుతానాగు ఒకే ముక్కలో. సూటిగా అడుగుతున్నానని ఏమీ అనుకోకు. నన్ను పెళ్లి చేసుకుంటావా, నిర్మలా?'

నిర్మల ఉలిక్కిపడింది, వివర్ణముఖంతో.

'బావా!' అంది ఏదో జరగరానిది జరిగినట్టు.

'ఔను. చెప్పు నీ మనసులోది.'

'వద్దు, బావా, నా జీవితంలో నన్ను ఎవరూ కోరుకోవద్దు, ప్రేమించవద్దు. వద్దు, బావా, వద్దు. క్షమించు' అంది గద్గద నిస్వనంతో.

పిడుగు పడింది నా మనసుపై.

ఎందుకు అని అడగాలనుకునేసరికే వెళ్లిపోయింది నిర్మల.

దేవదాసులాంటివా రుంటారా అని దేవదాసు నవల చదివినప్పుడనుకున్నాను. దేవదాసు మనసు నా కర్థమయింది.

ఆశించినది చేతికందే దూరంలో ఉంది గదా అని, చేతి కందినట్లే భావించడం ఎంత తప్పు! ఆశించడంలో గొప్ప లేదు, వసూ! ఆశించినది అందుకోగలగడంలోనే ఉంది.

అయినా నా ప్రయత్నాన్ని విరమించదల్చుకోలేదు నేను.

మళ్లీ ఒకటి రెండుసార్లు అడగాలనే నిశ్చయించుకున్నాను.

కానీ ఆ రోజంతా నిర్మల నాకు దూరంగానే ఉంది.

ఇది ఇంకా బాధాకరమైంది నాకు.

ప్రయత్నం ఇంత విఫలమౌతుందనుకోలేదు నేను.

ఇది జరిగి నెల రోజులైనా, ఇప్పుడు జరుగుతున్నట్లే ఉంది నాకు. అసలు అంతా కలలా ఉంది, వసూ! నిర్మల చెప్పినా నాకు నమ్మకం లేదు — నన్ను నిర్మల ప్రేమిస్తూనే ఉంది, ప్రేమించకుండా ఉండలేదు."

మునివేళ్లతో తలుపు తట్టిన చప్పుడయింది.

గౌతమి!

ఉత్తరాలు దాచేశాను. ఝివాగో తీశాను.

గౌతమి లోపలకు వచ్చింది.

"బలేవారే మీరు, ఇక్కడికి వచ్చేశారు."

"సారీ, గౌతమీ."

"ఫర్వాలేదుకానీ చెప్పి రావలసింది."

"ఔను. చెప్పి రావలసింది."

"దట్స్ గుడ్. అన్నట్టు మీ తలనెప్పి, నలత. . ?"

"ఆఁ, సమ్‌థింగ్ . . ."

"బెటర్? సరే, నే వెళ్లివస్తానండి. రేపు ఆఫీసుకు వస్తారుగా?"

"ఓ యస్. తప్పకుండా" అన్నాను వెళ్లటమే కావాలి అన్నట్టు.

"గుడ్‌నైట్" అంటూ వెళ్లిపోయింది గౌతమి.

ఎవరీ గౌతమి? గలగలా పారుతూంది గౌతమిలా, ప్రవహిస్తున్నకొద్దీ నిందాసముద్రం దగ్గరౌతోంది అనే చింత లేకుండా. గౌతమి చదువు అనర్థాలకు దారితీయరాదనుకున్నాను.

ఉత్తరం మళ్లీ ప్రారంభించాను.

". . . . . . నిర్మలని మళ్లీ అడిగా, ఒకసారి.

ఆవాళ ఫస్ట్‌షో సినిమానుండి వచ్చాను. అత్తయ్య నిర్మలనే నాకు అన్నం పెట్టమంది. నిర్మల వెనకాలనే వెళ్లాను. నిర్మల వడ్డిస్తూంది మౌనంగా.

'చూడు, బావా, కావలసింది అడిగి వేయించుకోవాలి. అడగందే అమ్మైనా పెట్టదు మరి. అయినా అన్నం తక్కువ తింటున్నావ్ గదూ?' అంది హఠాత్తుగా.

'అడిగినా పెట్టకపోతే ఏం చేస్తాను?'

'బావా! ఏంచెయ్యను, బావా?' కంఠం రుద్ధమైంది.

'నిర్మలా!'

## వదంతులు

వదంతులు వ్యాపింపజేసేవాడూ నిజం తెలుసుకోనకుండా విన్న దంతా అందరకూ చెప్పేవాడూ నీకు బద్ధశత్రువు అని భావించు.

—లవేటర్

'బావా!'

మరి మాట్లాడలేకపోయింది. పైటతో కన్నీరు తుడుచుకోవడం నేను గమనించాను. కంచంలో గీతలు గీస్తూ కూచున్నాను.

'పులుసు పొయ్యనా?'

'వద్దు.' కంచంలో చెయ్యికడుక్కొని బయటకు వచ్చాను. కాళ్లు కడుక్కోవటానికి దొడ్లోకి వెళ్లాను.

ఎందుకో కళ్లంట నీరు వస్తూంది. ఆపుకునే యత్నం చెయ్యలేదు.

'ఛ. ఎందుకు, బావా, కన్నీరు అర్థం లేకుండా?' అంది నిర్మల.

కన్నీరు తుడుచుకొని వీథిలోకి వచ్చాను.

'అప్పుడే భోజనమయిపోయిందా?' అంది అత్తయ్య.

'ఎలా ఉంది సినిమా?'

'బాగనే ఉంది' అన్నా నేను.

"రామాయణంలో పిడకల వేట."

• • •

కాగితా లన్నీ అయిపోయాయి.

ఏదో వ్యథ! బాధ!

తరవాత జరిగిన సంఘటనలన్నీ ఒకదాని తరవాత ఒకటి జ్ఞప్తికి రాసాగాయి.

ఆ మరునాటినుండి నిర్మలను చూస్తూంటే, హృదయం ముక్కలై పోసాగింది. ఎంతోసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను.

కాలేజీ లెక్చరర్‌పోస్ట్‌కు రిజైన్‌చేసి, హైదరాబాద్ చేరుకున్నా ఉద్యోగార్థం.

వచ్చిన ఇరవై రోజులలోనే ఏదో అదృష్టంకొద్దీ, ఈవెనింగ్ కాలేజీలో లెక్చరర్‌పోస్టు వచ్చింది. సంశయించక చేరిపోయాను.

చేరిన రెండు మూడు రోజులకే వసునుండి ఉత్తరం వచ్చింది. నేను హైదరాబాదు వెళ్ళిపోయినట్లు నిర్మల చెప్పిందిట. జరిగిన సంగతులన్నీ చెప్పిందిట. తను అలా అనడానికికూడా కారణముందిట. నిర్మల అంతక్కు మునుపే, ఎవరినో ప్రేమించిందిట, హృదయపూర్వకంగా ఆశించిందట. కానీ అతడు అకస్మాత్తుగా కలరావల్ల చనిపోయాడట. ఇప్పుడు నిర్మల తన మనస్సు ఎవరిమీదా నిల్పలేకపోతూందిట. నన్ను సలక్షణంగా వేరే పెళ్ళి చేసుకోమని వసుని నాకు వ్రాయమందిట. ఇదీ సారాంశం.

నిజమే అయిఉంటుందా? అనిపించింది.

అయినా అబద్ధం చెప్పవలసినంత అగత్యం ఏమిటి?

కానీ, నిర్మల ఈ విషయం నాతోటే ఎందుక్కు చెప్పలేకపోయింది? నేను తన్ను సరిగా అర్థం చేసుకోలేననా?

ఎందుకో తెలీదుగాని, నిర్మల నన్ను చేసుకోనన్న దానికన్న, ఇంతకుమునుపే ఎవర్నో ప్రేమించిందన్న మాటే నన్ను ఎక్కువగా గాయపరిచింది.

రెండు రోజులు ఆలోచించి, నిర్మలకు ఉత్తరం రాశాను — ఆ విషయం నాతోటే చెప్పవలసింది అని. అయినా జరిగింది కాబట్టి, తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి, తెలియజెయ్యమన్నాను.

దీనికి నిర్మలనుండి జవాబు ఆశించలేదు. కానీ జవాబు వచ్చింది పదిరోజులలోనే.

''బావా!

ఉత్తరం అందింది.

వసు వదినెగారు నీకు వ్రాసినదాంట్లో ఉన్నదంతా యథార్థమే. నువ్వు ఒక కుటుంబీకుడివి కావడం నాకెంతో ఇష్టం. కానీ నీ గృహిణిని నేను కాలేను.

అసలు పెళ్ళే తలపెట్టదలుచుకోలేదు.

నాన్నకు, అమ్మకు సాధ్యమైనంత త్వరలో ఈ విషయం తెలియపరుస్తాను.

అంతకన్న త్వరలోనే నీ పెళ్ళికి ఆహ్వానం అందుకోవాలని ఆశిస్తున్నాను.

నమస్కృతులతో
నిర్మల.''

అసలు నేనూ పెళ్ళి చేసుకోదలుచుకోలేదని నిర్మలకు రాద్దామనుకున్నాను కానీ పనితొందరలో రాయలేక పోయాను.

ఈవెనింగ్ కాలేజీలో ఉద్యోగం కాబట్టి, పగలంతా తీరికే. తీరికదొరకగానే నిర్మల జ్ఞప్తికి వచ్చేది. అందుకే పగలు పని చెయ్యడానికి నిశ్చయించుకున్నాను. ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం లభించింది.

ఒకసారి దాదాపు రెండేళ్ళ క్రిందట కాలేజి స్టూడెంట్స్‌తో నాగార్జునసాగర్ ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళాము. తిరిగివచ్చేటప్పుడు జరిగిన ప్రమాదంలో కుడిచెయ్యి పోయింది.

ఈ సమయంలో పరిచయమయింది గౌతమి నాకు. ఆమె అప్పుడే ఫర్మ్‌లో చేరింది. నాలో ఏం చూసిందో ఏమో, నాతో పరిచయం పెంచుకొంది.

నాకూ కొంత రిలీఫ్‌గా ఉండేది, గౌతమిని చూస్తే. కానీ ఆమెను నేను ప్రేమించలేను.

నా హృదయానికి రాణి ఒక్కే నిర్మలే.

గౌతమి రోజురోజుకూ నాతో చనువు పెంచుకుంది.

ఫర్మ్‌లో రూమర్స్ ఉన్నాయని వినికిడి.

''ఏం చేస్తున్నావురా? పడుకోలేదా ఇంకా?'' అంది అమ్మ

ఆలోచనలకు స్వస్తిచెప్పి లైటు ఆర్పాను.

*నిర్మల ఆలోచనలతో వేడెక్కిన తల, నిద్రాదేవి ఒడిలో విశ్రాంతి తీసుకోజాలింది.*

మరుక్షణంలో నేను ఏ లోకంలో ఉన్నానో నాకే తెలీదు.

మరునాడు పొద్దున్నే వెళ్ళి మదనమోహన్‌గారికి పుస్తకాన్ని రిటర్న్ చేశాను. నేను వసుంధరకు వ్రాసిన ఉత్తరాలుకూడా ఇచ్చాను.

మదనమోహన్ ఏదో మాట్లాడుతూ అన్నారు:

''ఈ బుక్‌లో లెటర్స్ ఉండాలండీ అన్నట్టు'' అని పేజీలు తిరగేసి, లెటర్స్ తీశారు. ''ఇవి చదవండి. కామేశ్వరరావుగారూ! పాపం, ఎవరో భగ్నప్రేమికుడు రాశాడు ఎవరికో.''

భగ్నప్రేమికుడు? మౌనంగా అందుకున్నాను.

''కానీ చాల నైస్‌గా రాశాడండీ. అందుకే దాచింది మాధవి ఇన్నాళ్ళూ.''

''మీ కెక్కడివి?'' ఎలాగో అడిగాను.

''ఏదో పేవ్‌మెంట్‌మీద కొందిట పుస్తకం. దాంట్లోనే ఉన్నాయి.''

హుఁ. వసు పుస్తకం అన్న మాట ఇది. చెత్తకాగితాల వాడికమ్మితే, నీరికి వచ్చింది.

''సరే, నే వెళ్ళివస్తానండీ.''

''మంచిది'' అన్నారు మదనమోహన్.

• • •

నిర్మల వస్తున్నట్లు ఉత్తరం వచ్చింది ఏదో ఇంటర్వ్యూకు.

ఎందుకో హృదయం పరవళ్ళుతొక్కింది.

నిర్మల వచ్చింది. రెండురోజుల తరవాత బయలు దేరింది మళ్ళీ.

ఉండమన్నాను. ఏమీ అనకుండా మరో వారం సెలవు పెట్టింది. చాలా సంతోషంవేసింది. గౌతమిని పరిచయం చేశాను నిర్మలకు.

ఆఖరిరోజు రాత్రి నిర్మలను మళ్ళీ కదిపాను.

''నన్నింక బలవంతం చెయ్యకు, బావా! నేనిక పెళ్ళే చేసుకోను'' అంది నిర్మల.

క్షణం ఆగి అంది మళ్ళీ.

''నే నొకటి అడుగుతా, బావా! ఇస్తావా?''

''అడుగు, నిర్మలా! నన్నడగవలసిందీ నువ్వే.''

''మాట మార్చకు మరి!''

''గౌతమిని పెళ్ళిచేసుకో, బావా!'' అంది.

ఇది నేను ఆశించాను కాబట్టి అంత ఆశ్చర్యపోలే.

''అది నువ్వు అడగాకూడదు, నేను చెప్పికూడదు.''

''బావా! అడగమన్నది నువ్వే.''

*''అయినా, నిర్మలా! విన్నెవరు అడగమన్నారు?''*

''ఎవరేమిటి, బావా! గౌతమే.''

''గౌతమా! నాతో చెప్పలేదేం మరి?''

''నీతో ఎలా చెప్పగలదు, బావా?''

''ఇప్పుడు వెన్నెల కాయుటంలేదు. ఇలాగే.''

నిర్మల ఏమీ మాట్లాడలేదు కొంతసేపు.

''గౌతమి నాతో చెప్పింది, బావా! నిన్ను తను ప్రేమిస్తూంది. పెళ్ళి చేసుకోమంటూంది. నన్ను అడగమంది బావా!'' అంది నిర్మల. ''నామటుకు నాకు గౌతమిఅంత మంచి ఇల్లాలు నీకు దొరకదనిపిస్తూంది.''

''మంచి అంటే?''

''బాహ్యసౌందర్యం కాకుండా అంతఃసౌందర్యం కోరుకుంటూంది గౌతమి.''

''నువ్వు వికలాంగుడివి'' అని ఎత్తి పొడుస్తూందా నిర్మల?

''గౌతమిని చేసుకుతీరాలి, బావా! నీవద్ద నాకున్న చనువుతో చెప్తున్నాను. గౌతమినే చేసుకో.''

''గౌతమిని చేసుకోవడం కలలోని మాట''.

''అదేమిటి, బావా? బ్రహ్మచారిగా ఉండిపోవాలనేనా?'' అంది నవ్వుతూ నిర్మల.

''నువ్వు బ్రహ్మచారిణిగ ఉండిపోవాలనేనా. . .?''

''నా సంగతి వేరు.''

''నా సంగతీ వేరే.''

''అయితే సరే, దీనికి చెప్పు. నేను నిన్ను చేసుకోనప్పుడు నువ్వెంత బాధపడ్డావో ఆలోచించు, బావా! గౌతమి నిప్పుడంత బాధకు గురి చెయ్యకు. నేను నిన్ను కోరుకుంటున్నాను.''

''నిర్మలా, ఇది చెప్పు. నే నెంత బాధ పడ్డానో తెలిసీ, నీ నిర్ణయం మారలే దెందుకు?''

నిర్మల మౌనంగా ఊరుకొంది.

''నాకు తెలుసు, నిర్మలా! గౌతమి ఎంత బాధపడుతుందో ఊహించుకోగల్గుతున్నాను. అయినా మనిషి అనేవాడు ఎవరినైనా ఒకరినే, ఒకసారే ప్రేమించగలడు. ఒకసారి హృదయపీఠంలో అలంకరించుకొన్న స్త్రీని మార్చి వేరొక స్త్రీని అలంకరించడం సాధ్యం కాదు. గౌతమిని బాధకు గురి చెయ్యడం ఇష్టం లేక పోయినా తప్పదు నాకు. నీ మాటను కాదని తోసిపుచ్చ వలసివస్తున్నందు కెంత బాధపడుతున్నానో తెలుసా? నన్నర్థం చేసుకో. గౌతమికి నచ్చజెప్పు.''

''నీ నిర్ణయం మార్చుకోలేవా? నాకోసం.''

''నిర్మలా! నాకోసం నీ నిర్ణయం మార్చుకోమని అడిగితే నీ వేమని జవాబిచ్చావు? అంతే. జరిగింది జరిగింది. గౌతమికే నచ్చజెప్పి వేరొకరిని చేసుకోమని చెప్పు. ఆమె జీవితంలో వెన్నెల కాయవలసిన రోజు లెన్నో ఉన్నాయి. నాకోసం గౌతమికి నచ్చజెప్పు. దీనికికూడా నువ్వే సమర్థురాలివి.''

నిర్మల ఏదో ఆలోచిస్తూంది.

ఉన్నట్టుండి అంది.

''గౌతమిని నే నింక అడగలేను, బావా, అది. నాకు తెలుసు ఆమె ఎంత బాధపడుతుందో. ఆ అగ్నికి ఆజ్యం పొయ్యలేను. మన ముగ్గురి జీవితాలు మూడు సమాంతరరేఖలు. అవి అనంతంలో ఎక్కడో కలుస్తున్నట్టున్నా, వాటి మధ్యదూరం మారదు, బావా! అవి ఎప్పటికీ కలుసుకోలేవు. నిజం కదూ, బావా!''

*తలెత్తి* చూశాను నిర్మలకేసి.

నిర్మల పేలవంగా నవ్వుతూంది. ★